హైదరాబాద్ వార్త



**బెర్తులన్నీ ఫుల్..** అసలు సిసలైన సంక్రాంతి పండుగకు కేరాఫ్ కోస్తాంధ్ర, ఆప్రాంత వాసులు ఎక్కడున్నా సంక్రాంతి వచ్చిందంటే చాలు సొంతూళ్లకు ప్రయాణమవుతారు. కానీ, ఏడాదికేడాదికి ప్రయాణం భారం అవుతుంది. తక్కువ ఖర్చుతో.. సుఖంగా రైలులో ఊరువెళ్దామని ఆశపడిన వారికి నిరాశ ఎదురవుతుంది. హైదాబాద్ నుంచి ఉత్తరాంధ్ర, కోస్తా జిల్లాలకు వెళ్లేరైళ్లలో ఒక్కబెర్త్‌కూడా ఖాళీగా కనిపించని పరిస్థితి నెలకొంది. హైదరాబాద్ నుంచి ఆంధ్రకు వెళ్లే రైళ్లలో గోదావరి, ఫలక్‌నుమా, చార్మినార్, శాతావాహన, ఈస్ట్‌కోస్ట్, నర్సాపూర్, కృష్ణా, కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌రైళ్లకు ఎక్కువగా డిమాండ్ ఉంటుంది. వీటన్నింటిలోనూ జనవరి 10 నుంచే 10రోజులపాటు బెర్తులన్నీ నిండిపోయాయి. రైల్వేశాఖ ప్రత్యేకంగా 94 రైళ్లను ఆతర్వాత మరో 30రైళ్లను ప్రకటించింది. అయినా ప్రయాణికులకు కష్టాలు తప్పడం లేదు.

# సంక్రాంతి దోపిడీ

- ఇష్టారాజ్యంగా ప్రైవైట్ ట్రావెల్స్ తీరు
- ప్రయాణికుల నుంచి అడ్డగోలుగా ఛార్జీలు వసూలు
- ఆర్‌టిసి బస్సులు, రైళ్లలో బెర్తులన్నీ ఫుల్
- తప్పని పరిస్థితిల్లో ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్న ప్రయాణికులు



హైదరాబాద్, జనవరి 13, ప్రభాతవార్త: సంక్రాంతి పండుగ సందర్భంగా పట్టణ ప్రాంతాల్లోని ప్రజలు సొంతూళ్లకు పయమవుతున్నారు. దీంతో ఆర్టీసి బస్టాండ్‌లతోపాటు, రైల్వే స్టేషన్లు సైతం ప్రయాణికులు రద్దీతో కిటకిటలాడుతున్నాయి. ముఖ్యంగా హైదరాబాద్‌లోని జూబ్లీబస్టాండ్, ఎంజిబిఎస్‌లలో ప్రయాణికుల రద్దీతో పుల్‌రష్‌గా ఉన్నాయి. పండగ సందర్భంగా ప్రభుత్వం అదనపు బస్సు సర్వీసులు అందుబాటులోకి తెచ్చినా బస్సులకోసం గంటలకొద్దీ పడిగాపులు కాయాల్సి వస్తుందని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆర్టీసి సర్వీసులు సరిపోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే ఇదే అదునుగా చేసుకుని కొన్ని ప్రైవేట్ ట్రావెల్‌బస్సులు అధిక ఛార్జీలతో ప్రజలను దోచుకుంటున్నారని ప్రయాణికులు చెబుతున్నారు. హైదరాబాద్ నుంచి గుంటూరు, విజయవాడ వెళ్లాలంటే మూడు వేలు ఛార్జీలు వసూలు చేస్తున్నారని వాపోతున్నారు. ఇంట్లో ముగ్గరు వెళితే.. ఒకనెల జీతంమొత్తం ట్రావెల్‌బస్సులకే పెట్టాల్సిన పరిస్థితి వస్తుందని అంటున్నారు. పండగ పూట ప్రజల బలహీనతను ఆసరగా చేసుకుని బస్సు ఛార్జీలను రెండు, మూడింతలు పెంచుతూ ప్రైవేట్ ట్రావెల్స్ దోపిడీకి పాల్పడుతున్నాయని సామాన్య ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హైదరాబాద్ నుంచి వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగించే మ్యాక్సీ క్యాబ్‌లు, మినీబస్సులు సైతం సంక్రాంతికి అధికధరలు వసూలు చేస్తున్నాయి. ముఖ్యంగా హైదరాబాద్‌లో స్థిరపడ్డ అంధ్రప్రాంతం వాళ్లు సొంతూళ్లకు వెళ్లడానికి విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. హైదరాబాద్ నుంచి విజయవాడ, విశాఖ, కాకినాడ, అమలాపురం, ఏలూరు, కపడ, చిత్తూరు, తిరుపతి తదితర మార్గాల్లో ప్రయాణికులు ఎక్కువగా ఉంటారు. ఇదే మంచి సమయం కావడంతో ఇష్టారాజ్యంగా వసూలు చేస్తున్నారు.

# పండుగపూట ధరల మంట

## చుక్కల్లో నిత్యావసరాల ధరలు



హైదరాబాద్, జనవరి 13 ప్రభాతవార్త : సంక్రాంతి పండుగ సామాన్యులకు భారంగా మారింది. నిత్యావసర వస్తువుల ధరలు నింగినంటాయి. నూనెల రేట్లు సలసల కాగుతున్నాయి. పిండి ధరలూ ఎగబాకాయి. ఫలితంగా పండుగ వేళ పిండి వంటలు ప్రియంగా మారాయి. పండుగకు వారం రోజుల ముందు నుంచే ఇళ్లలో పిండి వంటలు తయారు చేసుకుంటున్నారు. నగరంలో ఏ వీధికి వెళ్లినా మహిళలు వంటింట్లో పిండి వంటల తయారీలో నిమగ్నమవుతారు. ఈసారి ఆ పరిస్థితి కనిపించడంలేదు. నిత్యావసరాల ధరలు అడ్డగోలుగా పెరిగి పండుగ అంటేనే భయపడే పరిస్థితులు ఏర్పాడ్డాయి. ముఖ్యంగా నూనెలు, పప్పులు, నువ్వులు, వివధ రకాల పిండి ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. పిండి వంటలు ఏమోగానీ కనీసం పప్పునంతినే పరిస్థితులు కూడా లేవని పేద, మధ్యతరగతి వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే కూరగాయలు, మాంసం ధరలు విపరీతంగా పెరిగాయి. ఉల్లి, వెల్లి, అల్లం ధరలు కూడా పెరిగి ఇబ్బందులు పడుతున్న సామాన్యప్రజలు..పండుగకు పిండి వంటలు అంటేనే జంకుతున్నారు. ప్రతీ ఏడాది సంక్రాంతి పండుగ వచ్చిందంటే చాలు అన్ని వర్గాల ప్రజలు పిండి వంటలు తయారు చేసుకుంటారు. చెగోడీలు, గారెలు, సకినాలు, మురుకులు, అరిసెలు ..ఇలా రకరకాల పిండి వంటలు తయారు చేసుకుని పండుగ పూట మాంసాహారంతో కూడిన భోజనాలతో విందు చేసుకోవడం అనవాయితీ. అయితే ఈసారి అన్ని రకాల వస్తువుల ధరలు విపరీతంగా పెరిగి పండుగపై ప్రభావం చూపుతున్నాయి.

నూనెల ధరలు విపరీతంగా పెరిగాయి. గతేడాది సంక్రాంతి ముందు సన్‌ఫ్లవర్ ఆయిల్ లీటర్ ప్యాకెట్ ధర రూ.140 ఉండగా, ఇప్పుడది ఏకంగా రూ.160లు నుంచి రూ.175ల వరకు చేరింది. పల్లి నూనె ధర ఇప్పుడు రూ.160ల నుంచి రూ.185ల వరకు పెరిగింది. నూనెల ధరలు సలసల మంటుండడంతో పిండి వంటలు తయారు చేయడం ఇబ్బంది కరంగా మారింది. ఒక్కొఇంట్లో పిండి వంటల తయారి మూడు నుంచి ఐదు కిలోల వరకు నూనె ఖర్చవుతుంది. పెరిగిన ధరల నేపథ్యంలో నూనెలు కొనడం భారంగా మారిందని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పిండి వంటల తయారీలో ఎక్కువగా వినియోగించే నువ్వుల ధరలు కూడా పెరిగాయి. శనగ పిండి కిలో రూ.80, శనగపప్పు ధర కిలో రూ.80లకి పెరిగింది. శనగ పిండి కిలోకు ధర గతంలో కన్నా రూ.10లు పెరిగింది. బెల్లం కిలో ధర రూ.75 చొప్పున కొనుగోలు చేయాల్సి వస్తోందని పలువురు మహిళలు పేర్కొంటున్నారు. ఇతర వస్తువుల రేట్లు కూడా పెంచేశారు. ఇప్పుటికే గ్యాస్ సిలిండర్ ధర పెరిగింది. పండుగ ముందుర సిలిండరు ధరలు పెరిగి సామాన్యులు ఇబ్బందులు పడుతున్నారు. కరోనా మొదలైన నాటి నుంచి అన్ని వస్తువుల ధరలు పెరుగుతూ వచ్చాయి.

**మేక మాంసం కిలోకు రూ.850..** మాంసం ధరలు కొండెక్కాయి. పండుగ పూట మాంసం వండుకుందామంటే రూ.850లకు కిలో అమ్ముతున్నారు. ఇటీవల చికెన్ ధరలు మాత్రం అదుపులో ఉన్నాయి. అయితే పండుగ పూట చాలా మంది మేక, గొర్రె మాసం వండుకోవడానికి ఇష్టపడతారు. ఈ క్రమంలో పెరిగిన వాటి ధరలు సామాన్యుడికి భారంగా మారాయి. మాంసం కొనడం అంటేనే ఇబ్బందిగా భావిస్తున్నారు. కూరగాయల ధరలు కూడా ఎక్కువగానే ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఏం కొనాలో.. ఏం తినాలో అర్థం కావడం లేదని మహిళలు వాపోతున్నారు.

## నెలసరి వైద్యంతో కూడిన ఆరోగ్యానికి, జీవనోపాధికి భరోసా కల్పించాలి

**తెలంగాణ ఉన్నతవిద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి**



కార్యక్రమంలో పాల్గొన్న తెలంగాణ ఉన్నతవిద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి, తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుల సంక్షేమ సమితి ప్రతినిధులు

చిక్కడపల్లి, జనవరి 13 ప్రభాతవార్త: తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమం కోసం తెలంగాణ ప్రభుత్వం చిత్తశుద్దితో పనిచేస్తుందని తెలంగాణ ఉన్నతవిద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి అన్నారు. శుక్రవారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుల సంక్షేమ సమితి ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి ప్రొఫెసర్ లింబాద్రి హాజరై ప్రసంగించారు. తెలంగాణ సాధన అనంతరం రాష్ట్ర ప్రయోజనాలే లక్ష్యంగా సిఎం కెసిఆర్ పనిచేస్తున్నారని అభిప్రాయపడ్డారు. క్షేత్రస్థాయిలో ఉద్యమంలో క్రియాశీలకంగా పనిచేసిన వారందరికి ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందే విధంగా కృషి చేస్తానని అన్నారు. సమితి రాష్ట్ర అధ్యక్షుడు రూబీ స్టీవెన్‌సన్ మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనలో ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవడంతో పాటు ఆ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. చదువులు మానేసి రాష్ట్ర సాధనలో పాల్గొని వికలాంగులై ధీనస్థితిలో ఉన్న వారిని ఆదుకోవాలని, సొంతంగా ఇళ్ళులేని వారు కిరాయిలు కట్టలేక వృద్దాప్యంలో ఉన్న వారిని బతికించుకోలేక ఇబ్బందులు పడుతున్న కుటుంబాలకు డబుల్‌బెడ్ రూమ్ ఇళ్ళను కేటాయించడంతో పాటు నెలసరి వైద్యంతో కూడిన ఆరోగ్యానికి, జీవనోపాధికి భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగులు ఎంతో మంది ఉద్యమంలో పాల్గొని జీవనం కోల్పోయి అస్తవ్యస్థంగా మారి మానస్థితికి చేరుకున్నవారిని గుర్తించి ఆర్థిక సహాయం అందించడంతో పాటు వ్యాపారాలను చేసుకోవడానికి రుణ సదుపాయాలు కల్పించాలని, ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్న వారి కుటుంబాల్లో ఆడపిల్లలకై కల్యాణలక్ష్మి అందక కొందరైతే, వృద్దాప్య, ఆసరాఫించన్ అందక మరికొందరు, వారి ఇళ్లలో ప్రభుత్వం వెలుగులు నింపాలని, దేవుడు ఎక్కడున్నాడో తెలియదు కాని, తమ దైవం కెసిఆర్ అని ఆ వర్గాలు ఎదురుచూపుతుచూస్తున్నారని అన్నారు. గూడులేని వారికి డబుల్‌బెడ్ ఇళ్లను నిర్మించి ఇవ్వాలనని, రాబోయే ఎన్నికల్లో అర్హత నుబటిన్ట ప్రభుత్వం ఉద్యమకారులకు అవకాశాలను కల్పించాలని విజ్రుప్తి చేశారు. ప్రాథమిక చదువులే కాకుండా ఉన్నస్థాయి చదువులు ఉన్న వారికి ఉద్యమంలో పాల్గొన్నవారికి వారి కుటుంబాలను దృష్టిలో పెట్టుకుని నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలని కోరారు. ప్రతి అంశాన్ని పరిశీలలించి ఉద్యమ కారులకు భరోసా కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకుంది. సమితి అధ్యక్షుడిగా రూబీ స్టీవెన్‌సన్, ప్రధాన కార్యదర్శిగా తెలంగాణ వెంకన్న, కోశాధికారిగా రామ్‌చందర్‌గౌడ్, ఉపాధ్యక్షులుగా శశిధర్ శిల్ప, కార్యవర్గసభ్యులుగా బంగారం శ్రీనివాస్, అశోక్ కుమార్‌లు ఎన్నికయ్యారు. సమావేశంలో తెలంగాణ వికాస సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎర్రోజు శ్రీనివాస్, ఉద్యమకారులు రామగిరి ప్రకాశ్, గొల్లపూడి నాగేశ్, ముత్తయ్య మాణిక్, ప్రభు, తిరుమలరావు, వాడపల్లి మాధవ్, రాజమహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

## ఉప్పల్ చౌరస్తాలో.. ఆర్టీసీ బస్సుల వద్ద సంక్రాంతి రద్దీ



ఉప్పల్ చౌరస్తాలో సంక్రాంతి పండుగ సందర్భంగా సొంత ఊళ్లకు వెళ్లేందుకు ఆర్టీసీ బస్సుల వద్ద రద్దీ

ఉప్పల్, జనవరి 13 ప్రభాతవార్త : సంక్రాంతి పండుగకు స్వంత ఊళ్లకు వెళ్లేందుకు ఆర్టీసీ బస్ స్టేషన్ల వద్ద ప్రయాణికుల రద్దీ తీవ్రంగా పెరిగింది. శుక్రవారం ఉప్పల్ చౌరస్తాలోని అన్ని బస్టాప్ వద్ద బస్సుల కోసం ప్రయాణికులకు తంటాలు పడ్డారు. వరంగల్, కరీంనగర్, విజయవాడ, మహబూబాబాద్ తదితర ప్రాంతాలకు వెళ్లేందుకు ఉదయం నుంచే ఆర్టీసీ బస్టాప్‌ల వద్ద ప్రయాణికులు వేల సంఖ్యలో వేచి ఉన్నారు. ఉప్పల్ చౌరస్తా నుంచే శివారు ప్రాంతాల నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లేందుకు ఆర్టీసీ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. అయినప్పటికి ఆర్టీసీ బస్సులు పూర్తి స్థాయిలో లేకపోవడంతో ప్రైవేటు వాహనాలను ఆశ్రయించారు. ఉప్పల్ చౌరస్తాలోని ఆర్టీసీ బస్టాప్‌ల వద్ద ప్రైవేటు వాహనాలు పోటీ పడి ప్రయాణికులకు ఎక్కించుకున్నారు. ఆర్టీసీ అధికారులు బస్టాప్‌ల వద్ద ప్రత్యేకంగా టెంట్ వేసి మంచి నీటి సదుపాయం కల్పించారు. ఖాళీ బస్సులు రాగానే ప్రయాణికులు పోటీ పడి బస్సులు ఎక్కేందుకు సిద్దం కావడంతో తోపులాట జరిగింది. పోలీసులు పలు బస్టాప్‌ల వద్ద ప్రత్యేకంగా సిబ్బందిని నియమించారు. ఉప్పల్ చౌరస్తాలోని ఉదయం నుంచి రాత్రి వరకు బస్సుల కోసం జనం ఎగబడడం కనిపించింది.

## క్రీడాభివృద్ధికి సిఎం కెసిఆర్ ప్రత్యేక చర్యలు

**డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి**



డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డికి ఆహ్వాన పత్రికను అందజేస్తున్న టేబుల్ టెన్నీస్ ప్రతినిధులు

తార్నాక, జనవరి 13 ప్రభాతవార్త: క్రీడాభివృద్దికి సీఎం కేసీఆర్ ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని నగర డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి, బీఆర్ఎస్ కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షులు మోతె శోభన్‌రెడ్డి పేర్కొన్నారు. వెటర్న్ టేబుల్ టెన్నీస్ అసోషియేషన్ కమిటీ ప్రతినిధులు లాలాపేట్‌లోని ప్రొ. జయశంకర్ స్టేడియంలో వచ్చేనెల 5న జరుగనున్న ఓపెన్ టేబుల్ టెన్నీస్ టోర్నమెంట్ కార్యక్రమానికి హాజరు కావాలని డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు మోతె శోభన్‌రెడ్డికి వారు ఆహ్వానించి కార్డును అందజేశారు. ఈ కార్యక్రమంలో చీఫ్ పెట్రోన్ కృష్ణ, హానరరీ ప్రసిడెంట్ విజయ్‌కుమార్, ప్రసిడెంట్ దయాకర్ కుసుమ, వైస్ ప్రిసిడెంట్ హరినాథ్ బాబు, శ్రీనివాస్‌రావు, సెక్రటరీ విఠల్ బేతి, ఆర్గనైజింగ్ సెక్రటరీలు నవీన్‌కుమార్, బిఎంఎస్ రెడ్డి, భగవాన్, కోషాదికారి మురళి, సభ్యులు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మధుబాబు తధితరులు పాల్గొన్నారు.

## మినీ శిల్పారామంలో సంక్రాంతి సంబురాలు



ఉప్పల్ మినీ శిల్పారామంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా ప్రదర్శనలు ఇస్తున్న కళాకారులు



ఉప్పల్, జనవరి 13 ప్రభాతవార్త : ఉప్పల్ మినీ శిల్పారామంలో సంక్రాంతి సంబరాలు అంగరంగ వైభవంగా ప్రారంభం అయ్యాయి. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు శిల్పారామం ఆవరణలో గంగిరెద్దులు, హరిదాసులు, బుడబుక్కల, జంగమదేవరులు, పిట్టల దొర, ఎరుకలసాని తదితర కళాకారులు సందడి చేశారు. గంగిరెద్దుల ఆటలు, హరిదాసుల హరికీర్తనలు, బుడబుక్కల జంగమదేవరల గారడీమాటలు, పిట్టల దొర పిట్ట కథలు, ఎరుకలసాని చెప్పే సోది ఎంతగానో ఆకుట్టకుంది. సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో వినయ్‌కుమార్ శిష్య బృందంచే కూచిపూడి నృత్య ప్రదర్శన ఆహుతులను ఎంతో ఆలరించింది. మూషిక వాహన, పుష్పాంజలి, విన్నపాలు వినవలే, దశావతారం, జతి స్వరం, సంక్రాంతి పాట తదితర అంశాలను ప్రదర్శించారు. సంక్రాంతి పండుగ ప్రారంభం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి సందర్శకులు భారీగా తరలివస్తున్నారు. పండుగ సందర్భంగా ప్రతి రోజు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని శిల్పారామం అధికారులు తెలిపారు.





సికింద్రాబాద్‌లోని బలంరాయి ప్రధాన రహదారి మధ్య పెద్ద గుంత ఏర్పడడంతో నిత్యం వెళ్లే వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. శుక్రవారం ద్విచక్రవాహనంపై వెళుతున్న ఓ వాహనదారుడు కిందపడడంతో గాయాలయ్యాయి. ఇంత జరుగుతున్న సంబంధిత అధికారులు మాత్రం పట్టించుకోవడంలేదు.

# పతంగులు ఎగరేస్తున్నారా.. విద్యుత్ లైన్లతో జాగ్రత్త

**టిఎస్‌ఎస్‌పిడిసిఎల్ సిఎండీ రఘుమారెడ్డి పలు సూచనలు**



హైదరాబాద్, జనవరి 13, ప్రభాతవార్త: సంక్రాంతి పండుగ సందర్భంగా పతంగులు ఎగురవేయడం ఆనవాయితీగా వస్తుంది. సురక్షిత ప్రాంతాల్లో పతంగులు ఎగురవేయడం శ్రేయస్కరం, ఒకవేళ విద్యుత్‌లైన్ల వద్ద, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద పతంగులు ఎగురవేసినట్లయితే ఆపతంగులు మాంజాలు, విద్యుత్ లైన్లపై, ట్రాన్స్‌ఫార్మర్లపై పడి ప్రమాదాలు, విద్యుత్ అంతరాయాలు కలిగే అవకాశం ఉంటుందని సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ జి.రఘుమారెడినడ తెలిపారు. సాధారణ జాగ్రత్తలు పాటిస్తూ పతంగులు ఎగురవేసి పండగను మరింత ఆనందమయంగా జరుపుకోవాలని పలు సూచనలు చేశారు.

**తీసుకోవాల్సిన జాగ్రత్తలు ..**

- విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లకు దూరంగా, బహిరంగ ప్రదేశాల్లో, మైదానాల్లో మాత్రమే పతంగులు ఎదురవేయాలి
- విద్యుత్ లైన్లు, ట్రాన్స్ ఫార్మర్లు, సబ్‌స్టేషన్లు వద్ద ఎగురవేయడం ప్రమాదకరం
- ఒకవేళ పతంగులుకానీ, మాంజాలు కానీ విద్యుత్ లైన్లపై, ఇతర విద్యుత్ పరికరాలపై పడితే విద్యుత్ అంతరాయాలుతోపాటు ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది
- కాటన్, నైలాన్, లినెన్‌తో చేసిన మాంజాలను మాత్రమే వాడండి. మెటాలిన్ మాంజాలు వాడొద్దు. మెటాలిన్ మాంజాలు విద్యుత్ వాహకాలు కనుక అవి లైన్లపై పడ్డప్పుడు విద్యుత్‌షాక్ కలిగే అవకాశం ఉంది
- పొడి వాతావరణంలో మాత్రమే పతంగులు ఎగురవేయాలి. తడి వాతావరణంలో విద్యుత్ ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువ
- పతంగులు కానీ, మాంజాలు కానీ విద్యుత్ లైన్లపై, ఇతర విద్యుత్ పరికరాలపై పడ్డప్పుడు వాటిని వదిలేయండి. ఒకవేళ వాటిని పట్టుకుని లాగినప్పుడు విద్యుత్ తీగలు ఒకదానికొకటి రాసుకుని విద్యుత్ ప్రమాదం జరిగే అవకాశం ఉంది
- బాల్కానీ, గోడలమీద నుంచి పతంగులు ఎదురవేయరాదు. ఇది ప్రమాదకరం, ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది
- పతంగులు ఎగువేసేటప్పుడు తమ పిల్లలను గమనించగలరు. పిల్లలు తెగిన, కిందపడనడ విద్యుత్ వైర్లను తాకనీయవద్దు. అలాగే విద్యుత్ వైర్లపై , విద్యుత్ పరికరాలపై పతంగులు, మాంజాలు తెగిపడ్డట్లు ఉంటే.. అలాగే విద్యుత్ వైర్లు తెగిపడి ఉన్నా వాటనిఇ తాకకుండా వెంటనే విద్యుత్‌శాఖ టోల్‌ఫ్రీనంబర్ 1912కి గానీ సంస్థ మొబైల్ యాప్‌ద్వారా గానీ,వెబ్‌సైట్ ద్వారా కానీ తమకు తెలియజేయాలని సిఎండీ సూచించారు.

## స్టీల్‌బ్రిడ్జ్ నిర్మాణపు పనులకు యువకుడి ప్రాణం బలి



చిక్కడపల్లి, జనవరి 13 ప్రభాతవార్త: లోయర్‌ట్యాంక్‌బండ్ నుంచి విఎస్టీ వరకు నిర్మిస్తున్న స్టీల్‌బ్రిడ్జ్ నిర్మాణ పనులకు ఓ యువకుడి ప్రాణాన్ని బలితీసుకున్నాయి. బ్రిడన్జ నిర్మాణం పనుల నుంచి డ్యూటీ దిగి తమ కోసం కేటాయించిన క్యాంప్‌వద్దకు బయలుదేంరిన ఓ యువకుడు క్రేన్ వెనుక టైర్ కిందపడి అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన చిక్కడపల్లి పోలీసుస్టేషన్ పరిధిలో శుక్రవారం తెల్లవారుజామున జరిగింది. స్థానిక సిఐ ఎన్.సంజయ్‌కుమార్‌తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. లోయర్ ట్యాంక్‌బండ్ నుంచి విఎస్టీ వరకు జరుగుతున్న స్టీల్‌బ్రిడన్జ నిర్మాణ పనులకు బిహార్, ఉత్తర్‌ప్రదేశ్ తదితర రాష్ట్రాల నుంచి తీసుకువచ్చారు. యూపీ నుంచి వచ్చి రాజేశ్‌కుమార్(26) అనే యువకుడు 20 రోజుల కింద క్రేన్ హెల్పర్‌గా వచ్చి పనిలో చేరాడు. పనివారి కోసం విఎస్టీ వద్ద ఓ క్యాంప్‌ను సైతం ఏర్పాటు చేశారు. రాత్రి నుంచి ఉదయం వరకు డ్యూటీ దిగి క్యాంప్‌కు వెళ్లిపోయాడు. గురువారం రాత్రి నుంచి శుక్రవారం ఉదయం ఆరున్నర గంటల వరకు పనిచేసిన రాజేశ్‌కుమార్ తమకు కేటాయించిన క్యాంప్ వద్దకు వెళ్ళడం కోసం అశోక్ నగర్ తాడి కాంపౌండ్ వద్ద ఉన్న క్రేన్(టిఎస్ 09ఎఫ్‌డబ్ల్యు0181)ను ఎక్కబోవడంతో క్రేన్ డ్రైవర్ నరేంద్రకుమార్ ఇది చూసుకోకుండా నిర్లక్ష్యంగా క్రేన్‌ను పక్కకు తిప్పడంతో రాజేశ్ అదుపుతప్పి క్రేన్‌పై నుంచి కిందపడి వెనుక టైర్ కింద పడడంతో తీవ్రంగా గాయపడిన అతడిని ఆసుపత్రికి తరలించాలని ఫోన్ చేయగా అంబులెన్స్ వచ్చేలోపే అతడు మరణించారు. క్రేన్ డ్రైవర్ నరేంద్రకుమార్ నిర్లక్ష్యం వల్లే ఈ సంఘటన జరిగినందున అతన్ని అదుపులో తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

## పిజెఆర్‌కు నివాళ్లర్పించిన రేవంత్ రెడ్డి

ఖైరతాబాద్, జనవరి 13 ప్రభాతవార్త: సిఎల్‌పి మాజీ నేత పబ్బతిరెడ్డి జనార్ధన్ రెడ్డి (పిజెఆర్)కి నగరంలోని ఖైరతాబాద్‌లో టిపిసిసి అధ్యక్షులు రేవంత్ రెడ్డి ఘనంగా నివాళులర్పించారు. పిజెఆర్ జన్మదిన వేడుకలకు రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిఒగా విచ్చేశారు. పిజెఆర్‌కు నివాళులర్పించిన వారిలో మాజీ ఎంపి యం.అంజన్ కుమార్‌యాదవ్, మాజీ కార్పొరేటర్ ఎస్‌కె షరీఫ్, అధ్యక్షుడు కమ్మరి వెంకటేశ్ ప్రభృతులు పాల్గొన్నారు. టిపిసిసి ప్రధాన కార్యదర్శి కార్పొరేటర్ పి.విజయారెడ్డి ఆధ్వర్యంలో తండ్రి పిజెఆర్ వేడుకలు ఘనంగా జరిగాయి. క్రికెట్ టోర్నమెంట్, రక్తదాన శిబిరం, అన్నదానం తదితర వంటి కార్యక్రమాలు జరిగాయి. అంతకుముందు పిజెఆర్ అభిమానులు, యువకులు, మహిళలు, వివిధ కార్మికులు, నాయకులు పెద్దఎత్తున తరలివచ్చి పిజెఆర్ జన్మదినం సందర్భంగా పూల మాల, పుష్పగుచ్చాలు, భారీ కేక్‌లు కట్‌చేయడం వంటి వాటితో ఘనంగా నివాళులర్పించినట్లయింది. ప్రత్యేకంగా పిజెఆర్ క్రికెట్ టోర్నమెంట్‌లో టీంలోని యువకులంతా ఒకేరంగ టీషర్టులు ధరించి అందరిని ఆశ్చర్యపరిచినట్లయింది. పలువురితో పాటు ఈ కార్యక్రమంలో మహిళా నేతలు, ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. పిజెఆర్ జ్ఞాపకాలను వారంతా నెమరు వేసుకున్నారు.

### క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న జిజివైఎఫ్ చైర్మన్ గడ్డం శ్రీనివాస్‌యాదవ్,డి.బాల్‌రాజ్‌యాదవ్‌లు, డిప్యూటీ మేయర్

అఫ్జల్‌గంజ్, జనవరి 13ప్రభాతవార్త: వివేకనంద స్వామి యువజన సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన 2023 క్యాలెండర్‌ను గడ్డం గంగాధర్ ఫౌండేషన్ చైర్మన్, బిఆర్ఎస్ నాయకులు గడ్డం శ్రీనివాస్‌యాదవ్, బిసి సంక్షేమ చైర్మన్ డి.బాల్‌రాజ్ యాదవ్, డిప్యూటి మేయర్ మోతేశ్రీలత శోభన్‌రెడ్డి, ఉద్యమనేత ఆర్వీమహేందర్ కుమార్‌పటేల్, దిలిప్‌ఘనాతేలు ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో యువజన సంక్షేమ అధ్యక్షులు సతీష్‌గౌడ్ పాల్గొన్నారు.

### అసభ్యకరంగా వ్యవహరించిన నిర్వాహకుడిపై కేసు

కంటోన్మెంట్, జనవరి 13 ప్రభాతవార్త: కంటోన్మెంట్ బోయిన్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఫిట్‌నెస్ కోసం జిమ్‌కు వచ్చిన మైనర్ బాలికపై ట్రైనర్ అసభ్యకరంగా ప్రవర్తించి బెదిరింపులకు పాల్పడిన ఘటనపై బోయిన్‌పల్లి పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. బోయిన్‌పల్లి ఫిట్‌నెస్ ఆర్‌జో న్ జిమ్ ట్రైనర్ రాజు అనే వ్యక్తి మైనర్ బాలికతో పరిచయం ఏర్పాటు చేసుకొని సన్నిహితంగా ఉంటూ వారి రహస్య పోటోలు తీసుకొని శరీర భాగాలను తాకుతూ తీసుకున్నాడు. ఆ ఫొటోలను మార్ఫింగ్ చేసి వాటి అన్నింటిని ఆమె ఫోన్‌కు పంపించి బెది రింపులకు పాల్పడ్డాడు. మైనర్ బాలిక ఫొటోలను మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో పెడుతానని బెదిరించి నగదు డిమాండ్ చేశాడు. దీంతో మైనర్ బాలిక 20 తులాల బంగారం, 4 లక్షల నగదును అప్పగించింది. కానీ రాజు ఇంకా డబ్బులు కావాలని వేధింపులకు గురిచేయడంతో బోయిన్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది.

## రెండవ ఏఎన్‌ఎంలను తక్షణమే క్రమబద్ధీకరించాలి

**బీసీ సంక్షేమసంఘం జాతీయ అధ్యక్షులు, పార్లమెంట్ సభ్యులు ఆర్.కృష్ణయ్య**



ధర్నాలో నినాదాలు చేస్తున్న ఆర్.కృష్ణయ్య తదతరులు

ధర్నాచౌక్, జనవరి 13, ప్రభాతవార్త: నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) స్కీంలో పనిచేయుచున్న రెండవ ఏఎన్‌ఎంలను క్రమబద్ధీకరించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, పార్లమెంట్ సభ్యులు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. గురువారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో తెలంగాణ రాష్ట్ర ఏఎన్‌ఎంల ఆధ్వర్యంలో భారీ ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు ముఖ్యఅతిధిగా హాజరై కృష్ణయ్య మాట్లాడుతూ రెండవ ఏఎన్‌ఎం లను అనేక రాష్ట్రాలలో పర్మినెంట్ చేసినప్పటికీ, మిగులు బడ్జెట్ ఉన్న తెలంగాణ రాష్ట్రంలో చేయకపోవటం ఏం న్యాయమని ప్రశ్నించారు. ఎండనక, వాననక సేవలను అందిస్తున్న ఏఎన్‌ఎంలకు సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, పనిభారాన్ని తగ్గించాలని డిమాండ్ చేశారు. కరోనా మహమ్మారి ప్రపంచాన్ని వణికిస్తున్న సమయంలో కూడా ప్రజాసేవే పరమావధిగా ఇంటింటికి తిరిగి, ప్రజలకు అవగాహన కల్పిస్తూ వ్యాధిని కట్టడిచేయటంలో ముందువరసలో నిలిచిన ఏఎన్‌ఎంల సమస్యలు పరిష్కారం అయ్యే వరకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. వచ్చే పార్లమెంట్ సమావేశాలలో ఏఎన్‌ఎంల సమస్యలను లేవనెత్తుతానని తెలిపారు. 18 ఏళ్లనుండి ఎంతో ఆశతో ఎదురుచూస్తున్న ఏఎన్‌ఎంలను తక్షణమే భేషరతుగా క్రమబద్ధీకరించకపోతే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఏఐటియూసీ రాష్ట్ర అధ్యక్షులు ఎం.డి.యూసఫ్ మాట్లాడుతూ ఏఎన్‌ఎంల సమస్యలపై జనవరి 17 నుండి అన్ని జిల్లా కేంద్రాలలో ఆందోళలను నిర్వహిస్తామని తెలిపారు. ఈ ధర్నా కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జకృష్ణ, నిరుద్యోగ జేఏసీ చైర్మన్ నీల వెంకటేష్, వివిధ ప్రాంతాలనుండి తరలి వచ్చిన ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

### రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారిని కలిసిన టీజీటిఏ ప్రతినిధులు



చార్మినార్, జనవరి 13 ప్రభాతవార్త : రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారిని శుక్రవారం తెలంగాణ తహసీల్దార్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఎస్.రాములు, సెక్రటరీ జనరల్ ఎఫ్.పి.ఆర్.మల్లేష్ కుమార్, అసోసియేట్ ప్రెసిడెంట్ శ్రీనివాస్‌రావు, జనరల్ సెక్రటరీ రమేష్ రాపాకలు కలిసి అభినందనలు తెలియజేశారు.

### పేదలకు దుప్పట్లు పంపిణీ చేసిన మర్రి


పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న మర్రి

బేగంపేట జనవరి 13,ప్రభాతవార్త : దివంగత మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ మర్రి చెన్నారెడ్డి జయంతిని పురస్కరించుకొని బేగంపేట మోతీలాల్ నెహ్రూనగర్‌లోని తన కార్యాలయంలో మాజీ ఎన్‌డిఎమ్‌ఏ ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే, భాజపా నాయకులు మర్రి శశిధరరెడ్డి శుక్రవారం పేద కుటుంబాలకు దుప్పట్లు పంపిణీ చేసారు. ఈ సందర్భంగా మర్రి మాట్లాడుతూ తన తండ్రి మర్రి చెన్నారెడ్డి ముఖ్యమంత్రి గా ఉన్న సమయంలో ఎన్నో సమస్యలను అవలీలగా ఎదుర్కొని విజయం సాధించారని అన్నారు. ఆయన ఎన్నో అభివృద్ది కార్యక్రమాలు చేపట్టి అమలు చేసిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మర్రితో పాటు రాంగోపాల్‌పేట బిజెపి నాయకులు దయానందరావు తదితరులు పాల్గొన్నారు.

## కంటి వెలుగులో పాల్గొని అంధత్వం లేని తెలంగాణ రాష్ట్రంగా మార్చండి

**మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎం.మనోజ్‌రెడ్డి పిలుపు**



కంటి వెలుగుపై ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న మెడికల్ ఉద్యోగులు

సైఫాబాద్, జనవరి 13 ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'కంటి వెలుగు' కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి డాక్టర్లు, నర్సులు, సిబ్బంది శుక్రవారం నగరంలోని వివిధ ప్రాంతాలలో ఇంటింటి ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. బర్కత్‌పురలోని విక్రమ్‌నగర్ కమ్యూనిటి హాల్ నుంచి ఈ ఇంటింటి ప్రచార కార్యక్రమం ప్రారంభమై సమీపంలోని అన్ని బస్తీలలోని ఇంటింటికి వారు వెళ్ళి కరపత్రాలను పంపిణి చేసి కంటి వెలుగు కార్యక్రమం గురించి ప్రజలకు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా అందించే ఈ కార్యక్రమం ఈ నెల 18వ తేదీ ఉదయం 9 గంటలకు ప్రారంభమై సాయంత్రం వరకు వంద రోజులు పాటు కొనసాగుతుందని, అందరూ పాల్గొని అంధత్వం లేని తెలంగాణ రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు పూర్తిగా సహకరించాలని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎం.మనోజ్‌రెడ్డి, ఎస్‌పిహెచ్‌ఓ డాక్టర్ ఎ.పద్మజ ప్రజలను కోరారు. అందరికి ఉచితంగా నేత్రాలను పరిక్షించి, అవసరమను కుంటే ఉచితంగా శస్త్ర చికిత్స చేయడం జరుగుతందని, అంతేకాకుండా కళ్ళజోడు (సులోచనాలు) పంపిణి చేస్తామన్నారు. కంటి వెలుగు కార్యక్రమంలో పాల్గొనదలిచిన వారు ఆదార్ కార్డు జిరాక్స్, సెల్‌ఫోన్ వెంట తెచ్చుకోవాలని సూచించారు.

## జీవో 72తో రాష్ట్రంలోని 346 జూనియర్ కళాశాలలకు లబ్ది



సమావేశంలో ప్రసంగిస్తున్న తెలంగాణ ప్రైవేట్ జూనియర్ కళాశాలల యాజమాన్యం సంఘం(టిపిజేఎంఏ) రాష్ట్ర అధ్యక్షుడు గౌరీ సతీష్

చిక్కడపల్లి, జనవరి 13 ప్రభాతవార్త: రాష్ట్రంలోని ప్రైవేట్ జూనియర్ కళాశాలలకు సంబంధించి ఇటీవల ప్రభుత్వం జారీ చేసిన జీవో 72 వల్ల 346 లబ్ది చేకూరినట్లయిందని తెలంగాణ ప్రైవేట్ జూనియర్ కళాశాలల యాజమాన్యం సంఘం(టిపిజేఎంఏ) రాష్ట్ర కమిటీ పేర్కొంది. ఈ సందర్భంగా కళాశాలలకు 2023-2024 సంవత్సరానికి ఈ జీవో ద్వారా అఫిలియేషన్ ఇచ్చినందుకు టిపిజేఎంఏ నాయకత్వాన్ని అభినందించే కార్యక్రమం శుక్రవారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో టిపిజేఎంఏ హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల అసోసియేషన్ సర్వసభ్య సమావేశం అధ్యక్షుడు డాక్టర్ శ్రావణ్‌కుమార్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో అసోసియేషన్ రాష్ట్ర వ్యవస్థాపక గౌరవ అధ్యక్షుడు వరదారెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుపతిరెడ్డి, కోర్ కమిటీ సభ్యులు బాలకృష్ణారెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, రాజవర్ధన్‌రెడ్డి, అధికార ప్రతినిధి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గౌరీ సతీష్ మాట్లాడుతూ జీవో 72 రావడానికి కృషి చేసిన రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, రాష్ట్ర హోంమంత్రి మహమూద్ ఆలీ, హైదరాబాద్ లోకసభ సభ్యుడు సల్లాఉద్దీన్ ఓవైసీ, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డిలతో పాటురాష్ట్ర ప్రభుత్వ పెద్దలను అభినందిస్తున్నామన్నారు.

### 14న వివేక్‌నగర్ ఆంజనేయస్వామి దేవాలయంలో గోదాదేవి కల్యాణం

చిక్కడపల్లి, జనవరి 13 ప్రభాతవార్త: వివేక్‌నగర్ శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయంలో గోదాదేవి కల్యాణోత్సవాన్ని వైభవోపేతంగా నిర్వహించబోతున్నట్లు ఆలయం పునర్‌నిర్మాణ కమిటీ చైర్మన్ జి.మురళీప్రసాద్, ఈవో మాచర్ల దేవనాథం వివరించారు. సాయంత్రం 6 గంటలకు ఈ కార్యక్రమం ఉంటుందని, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారి కృపకుపాత్రులు కావాలని కోరారు.

### ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సకాలంలో పనులు పూర్తి చేయాలి: ఎమ్మెల్యే సూచన


పనుల పురోగతి గురించి అధికారులతో మాట్లాడుతున్న కాలేరు వెంకటేష్

హైదరాబాద్, జనవరి 13 ప్రభాతవార్త: బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లోని రహెత్‌నగర్‌లో స్థానిక ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ శుక్రవారం పాదయాత్ర నిర్వహించారు. అక్కడ జరుగుతున్న డ్రైనేజి పైప్‌లైన్ నిర్మాణ పనులను పరిశీలిం చారు. పనుల పురోగతి గురించి సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. పనుల్లో నాణ్యతాలోపం లేకుండా చూడాలని ప్రజలకు ఏలాంటి ఇబ్బందులు కలగకుండా సకాలంలో పనులు పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖ అధికారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### ఘనంగా సంక్రాంతి ముగ్గుల పోటీలు



ముగ్గులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శాంతి సాయిజన్ శేఖర్

తార్నాక, జనవరి 13 ప్రభాతవార్త: నాచారంలోని డీసీబీ బ్యాంక్ ఆధ్వర్యంలో సరస్వతినగర్‌లో నిర్వహించిన సంక్రాంతి ముగ్గుల పోటీలకు మంచి స్పందన వచ్చింది. మహిళలు, యువతులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని రంగు రంగుల ముగ్గులను వేశారు. ఈ వేడుకకు స్థానిక కార్పొరేటర్ శాంతి సాయిజన్ శేఖర్ పాల్గొని గెలుపొందిన వారికి బహుమతులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు జయరాజ్, కార్యదర్శి నాగభూషణం, వేణు, శ్రీరాంరెడ్డి, కరుణాకర్, సతీష్‌రెడ్డి, లక్ష్మిదేవి, బ్యాంగ్ మేనేజర్ విజయ సారధి, స్రవంతితో పాటు స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### ఆర్మీ క్రీడాకారులు జాతీయ పోటీల్లో ప్రతిభకనబర్చాలి : జంపనప్రతాప్


బోయిన్‌పల్లి ఆర్మీ వాలీబాల్ టోర్న మెంట్స్‌ను ప్రారంభిస్తున్న జంపన ప్రతాప్ తదితరులు

అడ్డగుట్ట, జనవరి 13 ప్రభాతవార్త: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని 1వ వార్డు బోయిన్‌పల్లి ప్లే గ్రౌండ్‌లో నిర్వహించిన వాలీబాల్ టోర్నమెంట్స్‌కు కంటోన్మెంట్ మాజీ ఉపాధ్యక్షుడు జంపనప్రతాప్ పాల్గొని ఇండియన్ ఆర్మీ టీమ్ వర్సెస్ క్రాప్స్ ఇఎంఈల పోటీల మధ్య జరిగిన వాలీబాల్ టోర్నమెంట్స్ పోటీలను జంపనప్రతాప్ ప్రారంభించారు.

### భారతదేశ ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన మహనీయుడు వివేకానంద

**ఆల్ ఇండియా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఎం.అనిల్‌కుమార్ యాదవ్**


స్వామి వివేకానంద విగ్రహానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నేతలు

ధర్నాచౌక్, జనవరి 13, ప్రభాతవార్త: మన భారతదేశ ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన మహనీయుడు స్వామి వివేకానంద అని ఆల్ ఇండియా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఎం.అనిల్ కుమార్‌యాదవ్ అన్నారు. స్వామి వివేకానంద జయంతి సందర్భంగా ట్యాంక్‌బండ్‌పై నున్న స్వామి వివేకానంద విగ్రహానికి స్థానిక కాంగ్రెస్ నేతలతో కలసి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అనిల్‌కుమార్ మాట్లాడుతూ వివేకానంద ప్రసంగంతో విదేశీయులను సైతం మంత్రముగ్ధులను చేసే వారని, ఆయన ప్రసంగాలు యువతకు మార్గదర్శకమని అన్నారు. స్వామి వివేకానంద స్ఫూర్తితో యువత ముందుకు సాగాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏ బ్లాక్ అధ్యక్షులు వి.డి.కృష్ణ, కవాడిగూడ అధ్యక్షులు ధర్మేందర్, గాంధీనగర్ అధ్యక్షులు అభిషేక్‌రెడ్డి, బి బ్లాక్ అధ్యక్షులు అంజియాదవ్, నగర ఉపాధ్యక్షులు పాశం అనిల్‌కుమార్ యాదవ్, ఇతర నాయకులు మేడి సురేష్, శివ, రమేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

### చార్మినార్ వద్ద సంక్రాంతి ముగ్గుల పోటీలు


కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర అధికార భాష సంఘం అధ్యక్షురాలు మంత్రి శ్రీ దేవి,సీనియర్ బిఆర్ఎస్ రాష్ట్ర నాయకురాలు సుశీలారెడ్డి, మంజుల రాణి

చార్మినార్, జనవరి 13 ప్రభాతవార్త : సంక్రాంతి పండుగ సందర్భంగా చార్మినార్ నియోజకవర్గం బిఆర్ఎస్ మహిళా విభాగం నాయకురాలు గుంటి మంజుల రాణి ఆధ్వర్యంలో చార్మినార వద్ద ముగ్గుల పోటీలు జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రాష్ట్ర అధికార భాష సంఘం అధ్యక్షురాలు మంత్రి శ్రీదేవి మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసిఆర్ హయాంలోనే రాష్ట్రం అన్ని రంగాలలోను ఎంతగానో అభివృద్ది సాధించిందని తెలిపారు. ప్రభుత్వం అన్ని పండు గలకు తగిన ప్రాధాన్యత ఇస్తున్నదని ఆమె తెలియజేశారు. ఈ కార్యక్ర మంలో బిఆర్ఎస్ నాయకురాలు, టిటియుసి ఉపాధ్యక్షురాలు గుంటి మంజుల రాణి, జి, శ్యామల, సురేఖతో పాటు పలువురు పాల్గొన్నారు.

### 26ఏండ్లుగా మర్రి చెన్నారెడ్డి క్యాలెండర్

**గౌస్ ను అభినందించిన మర్రి శశిధర్‌రెడ్డి**

బేగంపేట జనవరి 13, ప్రభాతవార్త : తనకు నచ్చిన రాజకీయ నాయకుడు చేపట్టిన వివిధ అభివృద్ది కార్యక్రమాలకు సంబంధించి ఆయన అభిమాని షేక్ గౌస్ 26 సంవత్సరాలుగా క్యాలెండర్ వేయించడం అభినందించదగ్గ విషయం. బేగంపేట ప్రకాష్‌నగర్ కు చెందిన షేక్ గౌస్ దివంగత మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ మర్రి చెన్నారెడ్డి హయాం నుంచి రాజకీయంగా ఆయన వెంటే నడిచారు. మర్రి చెన్నారెడ్డి మరణానంతరం ఆయన కుమారుడు ఎన్‌డిఎమ్‌ఏ ఉపాధ్యక్షులు, సనత్‌నగర్ మాజీ ఎమ్మెల్యే మర్రి శశిధరరెడ్డి వెంట ఉన్నారు. ఇటీవల కాలంలో మర్రి కాంగ్రెస్ పార్టీని వీడి భాజపాలో చేరారు. ఆయన వెంట గౌస్ కూడా భాజపాలో చేరారు. తనకు అత్యంత ఇష్టమైన దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ మర్రి చెన్నారెడ్డి పేరుతో ఈ ఏడాది కూడా ఆయన క్యాలెండర్ వేయించారు. శుక్రవారం మర్రి చెన్నారెడ్డి 104వ జయంతి సందర్భంగా ఇందిరా పార్క్ రాక్‌గార్డెన్‌లో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి చేతుల మీదుగా క్యాలెండర్ ను ఆవిష్కరింపజేసారు.

### ఓబిసి మహిళా మోర్చా కన్వీనర్ భాగ్యలక్ష్మీకి ఘన సన్మానం


భాగ్యలక్ష్మీని సన్మానిస్తున్న నర్సాగౌడ్, కిరణ్‌గౌడ్ తదితరులు

హైదరాబాద్, జనవరి 13, ప్రభాతవార్త: ఓబిసి మహిళా మోర్చా రాష్ట్ర కన్వీనర్‌గా నియమించబడ్డ మల్కేడి భాగ్యలక్ష్మీని ఓబిసి మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి అమరవేణి నర్సాగౌడ్, ఓబిసి గీత సెల్ రాష్ట్ర కన్వీనర్ రాగుల కిరణ్‌కుమార్ గౌడ్‌ల ఆధ్వర్యంలోని ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా శుక్రవారం గాయత్రినగర్‌లోని ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి శాలువా, పూల మాలలతో సత్కరించారు. ఈసందర్భంగా నర్సాగౌడ్ మాట్లాడుతూ రాబోయే అసెంబ్లీ పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రంలో బిజెపిని అధికారంలోకి తెచ్చేవిధంగా ఎస్సీ, ఎస్టీ, బిసి వర్గాల ప్రజలును ఐక్యం చేసి ముందుకుసాగుతున్నామన్నారు. ఈ కార్యకమంలో మహిళా నాయకురాళ్లు ఎం.స్వేత, డా.శిరీష, ఎ.నిర్మలాగౌడ్, ఎం.హైమావతి, ఏ.లక్ష్మీ, మోత్కూరు సంజీవ్‌గౌడ్, శరత్‌చంద్ర తదితరులు పాల్గొన్నారు.

### క్రీడాకారులను అన్ని విధాల ప్రోత్సహించాలి : మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ


ప్రపంచ మహిళా బాక్సింగ్ ఛాంఫియన్ విజేత నిఖత్ జరీనాను సన్మానిస్తున్న సీనియర్ బిజెపి నాయకులు మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ

చార్మినార్, జనవరి 13 ప్రభాతవార్త : క్రీడాకారులను ప్రభుత్వం అన్ని విధాల ప్రోత్సహించవలసిన అవసరం ఎంతైనా ఉందని మాజీ రాష్ట్ర బిజెపి మైనార్టీ అధికార ప్రతినిధి మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ అన్నారు. అర్జున్ అవార్డు గ్రహీత, ప్రపంచ మహిళా బాక్సింగ్ ఛాంఫియన్ విజేత నిఖత్ జరీనాను ఆయన సన్మానించి చారిత్రక బీబీకాఆలం మెమోంటోను ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులను ప్రభుత్వం అన్ని విధాల ప్రోత్సహించాలని కోరారు. నిఖత్ జరీనా తండ్రి మహ్మద్ జమీల్ అహ్మద్, ఆమె సోదరి అఫనన్ జరీనాతో పాటు పలువురు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

### హ్యాండ్‌బాల్ ఫెడరేషన్ కప్ ఛాంపియన్ రైల్వేస్


విజేతలకు ట్రోఫి అందజేస్తున్న జగన్మోహన్‌రావు, ఆనందీశ్వర్ పాండే

హైదరాబాద్, జనవరి 13, ప్రభాతవార్త: హ్యాండ్‌బాల్ ఫెడరేషన్ కప్ ట్రోఫీని పురుషుల విభాగంలో భారత రైల్వేస్ జట్టు, మహిళ విభాగంలో రాజస్థాన్ జట్టు కైవసం చేసుకున్నాయి. గతకొద్దిరోజులుగా రాజస్థాన్‌లో జరుగుతున్న ఈపోటీలు శుక్రవారం ముగిసాయి. పురుషుల ఫైనల్‌లో రైల్వేస్ 35-2తో సర్వీసెస్ జట్టుపై నెగ్గగా, ఉత్కంఠభరితంగా జరిగిన మహిళల ఫైనల్‌లో రాజస్థాన్ 22-21తో హరియాణాపై గెలిచి ట్రోఫిలను సొంతం చేసుకున్నాయి. భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) మాజీ కోశాధికారి ఆనందీశ్వర్ పాండేతో కలిసి ,జాతీయ హ్యాండ్‌బాల్ సంఘం (హెచ్‌ఏఐ) అధ్యక్షులు ఆరిసనపల్లి జగన్‌మోహన్‌రావు విజేత జట్లకు ట్రోఫీలను అందజేశారు. ఈసందర్భంగా జగన్మోహన్ రావు మాట్లాడుతూ ఒలింపిక్ క్రీడైనా హ్యాండ్‌బాల్‌కు దేశంలో ఇప్పుడిప్పుడే ఆదరణ లభిస్తుందని అన్నారు. కిందటి ఏడాది హైదరాబాద్ వేదికగా ఆసియా క్లబ్ ఛాంపియన్‌షిప్ విజయవంతంగా నిర్వహించామని ..భవిష్యత్‌లో భారత్ వేదికగా మరిన్ని ప్రతిష్టాత్మక టోర్నమెంట్లను నిర్వహిస్తామని అన్నారు. ఏడాదిన్నరగా తాము చేస్తున్న కృషి ఫలితంగా అంతర్జాతీయ వేదికల్లో భారత యువ జట్లు అద్భుతమైన ఫలితాలు సాధిస్తున్నాయని తెలిపారు. 2028 ఒలింపిక్స్ కల్లా భారత్‌జట్టుకు ప్రపంచంలోని టాప్ -10జట్లలో ఒకటిగా నిలపాలనే లక్ష్యంతో పని చేస్తున్నామని చెప్పారు.

### ఘనంగా వివేకానందుని జయంతి


వివేకానందస్వామి జయంతి ఉత్సవాల్లో పాల్గొన్నకేంద్ర వ్యవసాయ కమిటి సభ్యులు డి.గోపాల్‌జీ,మాజీ కార్పొరేటర్ మెట్టు వైకుంఠం,నటరాజ్‌లు

అఫ్జల్‌గంజ్, జనవరి 13 ప్రభాతవార్త: వివేకనందస్వామి జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని గోషామహల్ డివిజన్ బిజెపి పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో పాల్గొన్న కేంద్ర వ్యవసాయ కమిటి సభ్యులు డి.గోపాల్‌జీ, మాజీ కార్పొరేటర్ మెట్టు వైకుంఠం, గోషామహల్ డివిజన్ బిజెపి అధ్యక్షులు నటరాజ్ నామ్‌దారి, శంకర్‌లాల్‌యాద్‌లు గోషామహల్ నియోజకవర్గం వివేకనందస్వామి చిత్రపటానికి పూలమాలవేసి నివాళ్లు అర్పించారు. ఈకార్యక్రమంలో బిజెపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### అద్భుతంగా సాగిన రమాప్రభ శిష్యబృందం త్యాగరాజ కీర్తనల గోష్ఠిగానం

చిక్కడపల్లి, జనవరి 13 ప్రభాతవార్త: చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలో సద్గురు శ్రీ త్యాగరాజస్వామి 176వ ఆరాధనోత్సవోత్స వాలు గానసభ అధ్యక్షుడు కళావిఎస్.జనార్దనమూర్తి అధ్యక్షతన జరిగింది.

## మద్యం సేవించి వాహనాలు నడపవద్దు

**బేగంపేట ట్రాఫిక్ ట్రయినింగ్ ఇనిస్టిట్యూట్ ఎసిపి శంకర్‌రాజు**

బేగంపేట జనవరి 13, ప్రభాతవార్త : మద్యం సేవించి వాహనాలు నడప వద్దని, మితిమీరిన వేగంతో ప్రాణాలు కోల్పోవద్దని బేగంపేట ట్రాఫిక్ ట్రయినింగ్ ఇనిసిట్యూట్ ఏసీపీ శంకర్‌రాజు అన్నారు. శుక్రవారం బేగంపేట శ్యాంలాల్ బిల్డింగ్‌లోని ఓ మోటార్స్ వర్క్‌షాప్ లో విధులు నిర్వర్తిస్తున్న సిబ్బందికి ఏసీపీ శంకర్‌రాజు ట్రాఫిక్ పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏసీపీని వర్క్‌షాప్ జీఎం శ్రీనివాస్ సాద రంగా ఆహ్వానించారు. ఏసీపీ మాట్లాడుతూ బేగంపేట ట్రాఫిక్ ట్రయినింగ్ ఇనిస్టి ట్యూట్ ఆధ్వర్యంలో ఈ మధ్య కాలంలో నగరంలోని అన్ని కళాశాలల్లో ట్రాఫిక్ నిబం ధనలపై విధ్యార్థినీ, విధ్యార్థులకు అవగాహనా కార్యక్రమాలను నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్యంగా యువత మత్తు పదార్థాల వైపు ఆకర్షితులు కావద్దని, వాహనాలు నడిపే సమయంలో ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలంటూ అవగా హన కల్పించామన్నారు. అలాగే శుక్రవారం బేగంపేట వరుణ్ మోటార్స్‌లో పనిచే స్తున్న వారికి ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించామన్నారు. ప్రతి ఒక్కరికి ఒక కుటుంబం ఉంటుందని, ఆ కుటుంబంలోని ఒకరు ఇంటి నుంచి వాహనంపై బయటకు వెళితే వారు క్షేమంగా తిరిగి ఇల్లు చేరే వరకు ఇంటి వద్ద ఆ కుటుంబం ఎదురు చూస్తుంటుందన్నారు. ఈ అవగాహనా కార్యక్రమంలో టీటీఐ ఇన్స్‌పెక్టర్ నాగరాజు, లా అండ్ ఆర్డర్ ఎస్సైఆర్ జయచంద్ర, అబ్దుల్ మజీద్‌ఖాన్, చిరంజీవి, సుమన్ సిబ్బంది పాల్గొన్నారు.

## మహిళలు అన్నిరంగాల్లో అభివృద్ధి చెందాలి : శ్రీగణేష్



ముగ్గుల పోటీ విజేతలకు బహుమతులు ప్రధానం చేస్తున్న శ్రీగణేష్ తదితరులు

కంటోన్మెంట్, జనవరి 13 ప్రభాతవార్త: మహిళలు వంటింటికే పరిమితం కాకుండా అన్నిరంగాల్లో అభివృద్ధి చెందాలని కంటోన్మెంట్ నియోజకవర్గానికి చెందిన ప్రముఖ నేత ఎన్.శ్రీగణేష్ తెలిపారు. శుక్రవారం మారేడ్‌పల్లి జిహెచ్‌ఎంసి షెనాయ్ ప్లేగ్రౌండ్‌లో నిర్వహించిన ముగ్గుల పోటీలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. రంగోలి పోటీల్లో పాల్గొన్న 15 విజేతలకు లక్షలాది రూపాయల విలువ చేసే బహుమతులను శ్రీగణేష్ చేతుల మీదుగా అందజేశారు. విజేతలకు కంటోన్మెంట్ నియోజకవర్గానికి చెందిన ప్రముఖ జర్నలిస్టులు రాములు, రాజయ్య, రాజు, నరేష్‌ల చేతుల మీదుగా బహుమతులు ప్రధానం చేశారు. ముగ్గుల పోటీల్లో విజేతలుగా నిలిచిన గాంధీ నగర్ సౌజన్యకు మొదటి బహుమతి, కార్ఖానకు చెందిన చిన్నమ్మ రజితలకు ద్వితీయ బహుమతి, దివ్యకు 3వ బహుమతి, మారేడ్‌పల్లికి చెందిన హిమ బింధులకు 4వ బహుమతులను శ్రీగణేష్ చేతుల మీదుగా అందజేశారు.


సికింద్రాబాద్ అక్షర వాగ్దేవి పాఠశాలలో సంక్రాంతి వేడుకల్లో పాల్గొన్న అడిషినల్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీసు పి రంగారావు, పాఠశాల వైస్ చైర్మన్ పిఎల్ శ్రీనివాస్

# బడంగ్‌పేట్, మీర్‌పేట్ కార్పొరేషన్లలో అభివృద్ధి పనులకు రూ.11.36 కోట్లు మంజూరు: మంత్రి సబితాఇంద్రారెడ్డి

**సరూర్‌నగర్, జనవరి 13 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్, మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్లలో వివిధ అభివృద్ధి పనులకు రూ. 11.36 కోట్లు మంజూరయ్యాయని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి పట్లోళ్ళ సబితా ఇంద్రారెడ్డి శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. ఇందులో మీర్‌పేట్ మంత్రాల చెరువు సుందరీకరణకు రూ.2 కోట్లు, విద్యుత్ దీపాలకోసం మరో కోటి, బడంగ్‌పేట పాత గ్రామ పంచాయతీ చౌరస్తా నుండి సికెఆర్, కెటిఆర్ ఫంక్షన్ హాల్ రోడ్డు గుండా బాలాపూర్ ఆర్‌సిఐ రహదారి వరకు సెంట్రల్ లైటింగ్ కోసం రూ.30 లక్షలు, అదే విధంగా బాలాపూర్ చౌరస్తా నుండి నాదర్‌గుల్ ప్రభుత్వ పాఠశాలవరకు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు రూ. 2.50 కోట్లు మంజూరయ్యాయని ఆమె వివరించారు. అంతే కాకుండా నూతన బడంగ్‌పేట్ కార్పొరేషన్ కార్యాలయం నుండి గుర్రంగూడ క్రాస్ రోడ్డువరకు విద్యుత్ దీపాల కోసం రూ.1.20 కోట్లు, బడంగ్‌పేట్ అయ్యంగార్ బేకరీ నుండి అల్మాస్‌గూడ కమాన్ వరకు విద్యుత్ లైట్ల ఏర్పాటు కోసం రూ.45 లక్షలు, అల్మాస్‌గూడ కోమటికుంట చెరువు నుండి బిఎన్‌రెడ్డి వరకు రూ.50 లక్షలు మంజూరు కావడం జరిగిందని మంత్రి వివరించారు. అదే విధంగా మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని జిల్లెలగూడ స్వాగత్ గ్రాండ్ హోటల్ రోడ్డు నుండి నందనవనం వరకు సెంట్రల్ లైట్ల కోసం రూ.37 లక్షలు, జిల్లెలగూడ అంబేద్కర్ విగ్రహం నుండి అల్మాస్‌గూడ కమాన్ వరకు సెంట్రల్ లైట్ల ఏర్పాటు కోసం రూ.78 లక్షలు, మీర్‌పేట్ ప్రశాంతిహిల్స్ నుండి విజ్ఞానపురి కాలనీ వరకు సెంట్రల్ లైట్ల కోసం రూ.76 లక్షలు మంజూరు అయ్యాయని మంత్రి తెలిపారు. మొత్తం రూ.11.36 కోట్లతో ఆయా అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందని పేర్కొన్నారు. అయితే మహేశ్వరం నియోజకవర్గ అభివృద్ధికి సహకరిస్తున్న సిఎం కెసిఆర్, పురపాలక శాఖ మంత్రి కెటిఆర్‌లకు సబితారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

## ఘనంగా టిఎస్‌యూటిఎఫ్ రాష్ట్ర స్థాయి మహాసభలు



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సబితారెడ్డి

**తుర్కయంజాల్, జనవరి 13 ప్రభాతవార్త :** తుర్కయంజాల్ మున్సిపాలిటీ మన్నెగూడలోని బిఎంఆర్ సార్థ కన్వెన్షన్‌లో జరిగిన టిఎస్‌యూటిఎఫ్ 5 వ రాష్ట్ర స్థాయి మహాసభలకు రాష్ట్ర విద్యా శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను ఉద్దేశించి మంత్రి మాట్లాడుతూ క్రమశిక్షణ గల సంఘంగా తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఉపాధ్యాయుల కోసం పనిచేయటం అభినందనీయమన్నారు. విద్యా వ్యవస్థ కరోనా వల్ల అనేకసవాళ్ళను ఎదుర్కొందని, ఆ సమయంలో డిజిటల్ విద్యా బోధనకు ప్రభుత్వం నిర్ణయించడంతో ఉపాధ్యాయులు అందించిన సహకారం గొప్పదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉన్నతవిద్యలో నోటిఫికేషన్లను జారి చేసిందని, పాఠశాల విద్యలో ఖాళీల భర్తీ కూడా చేపడతామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం భర్తీ చేస్తున్న ఉద్యోగాల్లో విద్యా శాఖవే ఎక్కువ ఉద్యోగాలు ఉన్నాయన్నారు. సమాజంలో మార్పు తెచ్చే శక్తి కేవలం ఒక ఉపాధ్యాయులకు మాత్రమే ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కేరళ రాష్ట్ర మాజీ వైద్య శాఖ మంత్రి, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే శైలజ టీచర్, జడ్పీ చైర్ పర్సన్ తీగల అనితరెడ్డి, ఎమ్మెల్యేలు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, జైపాల్ యాదవ్, ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ నాగేశ్వర్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు వెంకటరమణరెడ్డి, డీసీసీబీ చైర్మన్ మనోహర్‌రెడ్డి, టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జంగయ్య, ప్రధాన కార్యదర్శి చావ రవి, రాష్ట్రం నలుమూలల నుండి తరలివచ్చిన ఉపాధ్యాయులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఐవిఎఫ్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

**ఎల్.బి.నగర్, జనవరి 13 ప్రభాతవార్త:** సంక్రాంతి పండుగ అంటే ప్రకృతి పండుగ రాష్ట్ర పర్యాటకశాఖ అభివృద్ధి చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా పేర్కొన్నారు. ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ స్టేట్ మహిళా విభాగం ఆధ్వర్యంలో రంగోలి, తంబోలా పోటీలను చైతన్యపురిలో నిర్వహించారు. పోటీలో గెలుపొందిన విజేతలకు శ్రీనివాస్‌గుప్తా బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముగ్గుల పోటీలు సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకలు అన్నారు. ఈ కార్యక్రమంలో ఐవిఎఫ్ వర్కింగ్ ప్రెసిడెంట్ గంజి రాజమౌళిగుప్త, పబ్బ చంద్రశేఖర్, మహిళా విభాగం ప్రథమ మహిళ ఉప్పల స్వప్న, కోశాధికారి కొడిప్యాక నారాయణ, చందా భాగ్యలక్ష్మి, లెంకలపల్లి మంజులరాజు, గుడిపాటి బువనేశ్వరి, కలకొండ మణిమాల తదితరులు పాల్గొన్నారు.

## డివిజన్‌లో విద్యుత్ స్తంభాలు, లైట్లు ఏర్పాటు చేయాలని వినతి

**సరూర్‌నగర్, జనవరి 13 ప్రభాతవార్త:** మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని 36వడివిజన్‌లో విద్యుత్ సమస్యల పరిష్కారానికి 12 స్తంభాలు, విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయాలని స్థానిక కార్పొరేటర్ ఎడ్ల మల్లేష్ ముదిరాజ్ కమీషనర్‌ను కోరారు. ఈ మేరకు ఆయన కమీషనర్ చిట్టి నాగేశ్వర్‌రావును కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మల్లేష్ మాట్లాడుతూ తగినన్ని విద్యుత్ స్తంభాలు లేకపోవడం స్థానికంగా విద్యుత్ సమస్యలు కలుగుతున్నాయనీ ఈ నేపథ్యంలో సాధ్యమైనంత త్వరలో స్తంభాలను ఏర్పాటు చేసి ఎల్ఇడి లైట్లను వేయాలని కోరారు.

## సామాజిక భాధ్యతపై ఢిల్లీ పబ్లిక్ స్కూల్లో విధ్యార్థులకు అవగాహన




పాటలు పాడుతున్న స్టూడెంట్స్

**నాచారం, జనవరి 13 ప్రభాతవార్త:** పిల్లలకు బాల్యం నుంచే సామాజిక కార్యక్రమాల పట్ల అవగాహన కల్పించేందుకు నాచారం డిపిఎస్ నడూంబిగించింది. జాయ్ ఆఫ్ గివింగ్ పేరుతోస్కూల్లో కౌంటర్లను ఏర్పాటు చేసి విధ్యార్థులచే పేదలకు నిత్యావసర వస్తువులైన నిత్యావసర వస్తువులు, గణిత శాస్త్ర సాధనాలు, స్టేషనరీ వస్తువులను అందజేయడం వంటి సామాజిక కార్యక్రమానికి స్వీకారం చుట్టింది. అందులో భాగంగా డిపీఎస్ గుర్తించిన పలువురి పేదలకు పిల్లలతో వస్తువుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా యూనిసెఫ్ ఎగ్జిక్యూటీవ్ అసిస్టెంట్ సోని అబ్రహం, హెల్పింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్ అనే హెల్త్ కేర్ ఎన్జీఓ వ్యవస్థాపకులు ముజ్తబా, ప్రిన్సిపల్ డా. సునిత రావు తధితరులు హాజరై సామాజిక సేవలపై పిల్లలకు అవగాహన కల్పించారు.

## స్వర్ణకారులను ప్రభుత్వం ఆదుకోవాలి: రాఘవాచారి



సిఎస్ శాంతకుమారికి వినతిపత్రం అందజేస్తున్న రాఘవాచారి

**సైదాబాద్, జనవరి 13 ప్రభాతవార్త:** రాష్ట్రంలోని స్వర్ణకారులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతూ తెలంగాణారాష్ట్ర స్వర్ణకారసంఘం అధ్యక్షుడు వింజమూరి రాఘవాచారి, కార్యదర్శి రాగిఫని సతీష్ కుమార్‌లు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎ.శాంతకుమారికి వినతిపత్రం అందజేశారు. కార్పొరేట్ దుకాణాల వల్ల రాష్ట్రవ్యాప్తంగా స్వర్ణకారులు పనిలేక ఆర్థిక ఇబ్బందులలో కూరుకుపోయారని, కనీసం భార్యాబిడ్డలను పోషించలేని దుస్థితిలో ఉండి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, స్వర్ణకారుల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించాలని వారు సిఎస్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మండలోజు భీష్మాచారి, రాష్ట్ర సహాయ కార్యదర్శి పున్నోజు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా గోదా, రంగ మన్నార్ స్వాముల కళ్యాణోత్సవం

**వనస్థలిపురం, జనవరి 13 ప్రభాతవార్త :** జనప్రియహోమ్స్‌లో శ్రీ గోదా పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవ సందర్భంగా శుక్రవారం శ్రీ గోదా, రంగ మన్నార్ స్వాముల కళ్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీనివాస వ్రతధర్ స్వామి విచ్చేసి అనుగ్రహ భాషణం చేసి భక్తులకు మంగళశాసనములు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫౌండర్ చైర్మన్ పివి నర్సింహ్మారావు, మహేష్, సాంబశివరావు, దుర ప్రసారావు, శాంతశ్రీ, స్వరూప, సత్యవతి పాల్గొన్నారు.

## లార్డ్స్‌లో ఘనంగా సంక్రాంతి సంబరాలు

**సరూర్‌నగర్, జనవరి 13 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని శివనారాయణపురం లార్డ్స్ పాఠశాలలో శుక్రవారం సంక్రాంతి సంబరాలు కనుల పండువగా జరిగాయి. పండుగపై విద్యార్థుల అవగాహనకోసం పాఠశాల యాజమాన్యం సంక్రాంతి పండుగను నిర్వహించి విద్యార్థినిలచే పాఠశాల ఆవరణలో ముగ్గులను వేసి అలరించారు. అదే విధంగా భోగి మంటలు హరిదాసుల వేషధారణలో అలరించారు. గంగిరెద్దుల సందడి, పిట్టల దొర డాంబికాల పలుకులు ఆకట్టుకున్నాయి. ఈ వేడుకల్లో పాఠశాల చైర్మన్ సిద్దాల బీరప్ప, వైస్ చైర్మన్ బి.శ్రీనివాస్‌రెడ్డి, అనూరాధ, ప్రిన్సిపాల్ సంతోష్, ఇంఛార్జి రేఖ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## హరిహర క్షేత్రంలో ధనుర్మాస ఉత్సవాలు

**మలక్‌పేట, జనవరి 13 ప్రభాతవార్త :** మలక్‌పేట పల్టాన్‌లోని హరిహరక్షేత్రంలో ధనుర్మాస ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా ఆలయ ట్రస్టీ సూగూరు రమేష్ మాట్లాడుతూ 14వ తేఈన గోదా కల్యాణం నిర్వహిస్తున్నామని భక్తులు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఇట మార్తండారావు, సభ్యులు రొడ్డ రమేష్‌రావు, సరాపు శ్రీహరి, విజయ్‌కుమార్, సత్యేందర్, పారిజాతరెడ్డి, రేణుఅగర్వాల్, చంద్రశేఖరశర్మ, మంగళగిరి శ్రీనివాసాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఉడ్ క్లస్టర్ ద్వారా వడ్రంగి కులస్థులకు జీవనోపాధి

**ఉప్పల్, జనవరి 13 ప్రభాతవార్త :** తెలంగాణలో కమ్మరి, వడ్రంగి కులస్థులకు ఉడ్ క్లస్టర్ ద్వారా జీవనోపాధి లభిస్తుందని, రాష్ట్రంలోని 33 జిలాలకు క్లస్టర్ తీసుకుని వెళ్లాల్సిన అవసరం ఉందని శ్రీ మద్విరాట్ గాయత్రి విశ్వకర్మ ప్రొడ్యూసర్ కంపెనీ ఎం.డి.గంధాల శ్రీనివాసచారి పేర్కొన్నారు. ఈ మేరకు రంగారెడ్డి జిల్లా వుడ్ కార్వింగ్ క్లస్టర్ అర్టిజన్ కాస్ట్ డిస్టిబ్యూషన్, విశ్వ బ్రహ్మణ మనుమయ సంఘం కొత్త సంవత్సరం క్యాలెండర్ అవిష్కరణ శుక్రవారం ఉప్పల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎంఎస్ఎంఈ అసిస్టెట్ డైరెక్టర్ కె.శివరామ్‌ప్రసాద్, జిఎం ఎస్‌కె.శర్మ, పలువురు విశ్వకర్మ నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ వడ్రంగి కళాకారులు చేతి వృత్తిదారులకు ప్రభుత్వం అందిస్తున్న ఉపాధి అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఒక వ్యక్తి చేసే పనికి ఒక వ్యవస్థ ద్వారా పది మందికి పని ద్వారా లబ్ది పొందే అవకాశం ఉందన్నారు. విశ్వకర్మ కులస్థులకు అన్ని రంగాల్లో రాణించాలని, ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎంఎస్ఎంఈ ద్వారా సుమారు రూ.ఐదు కోట్ల వరకు రుణాలు పొందే వీలు ఉందని తెలిపారు. చేతి వృత్తులను కాపాడేందుకు ఎంఎస్ఎంఈ ఎంతో కృషి చేస్తుందన్నారు. ఈ సందర్భంగా వుడ్ కార్వింగ్ క్లస్టర్‌లకు గుర్తింపు కార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కంపెనీ డైరెక్టర్లు వెల్దండ రవీంద్రచారి, పానుగంటి లక్ష్మణాచారి, శ్రీకాంత్ఆచారి, నరేంద్రచారి, బ్రహ్మాచారి, సత్యనారాయణచారి, శ్యామ్‌చారి, కృష్ణ, అంజనేయులు, సింధూజ, స్నిగ్ధరూప, కవిత, కల్యాణి, ప్రమీల, గోవిందమ్మ తదితరులు పాల్గొన్నారు.

## నేడు బడంగ్‌పేట్‌లో గోదా రంగనాథుల కళ్యాణం

**సరూర్‌నగర్, జనవరి 13 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్‌లోని శ్రీ కాశీబుగ్గలో శ్రీ పద్మావతీ అలివేలు మంగా సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ధనుర్మాసం సందర్భంగా శనివారం గోదా రంగనాథుల కళ్యాణం జరుగుతుందని ఆయన ధర్మకర్త చక్రవర్తుల జగన్మోహనాచార్యులు తెలిపారు. భోగి పండుగరోజు ఉదయం 10గంటలకు కళ్యాణోత్సవ వేడుకలు ప్రారంభమవుతాయని ఆయన పేర్కొన్నారు. ఈ వేడుకలకు అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందనీ ఈ నేపథ్యంలో భక్తులు అధిక సంఖ్యలో హాజరై కళ్యాణోత్స వాన్ని తిలకించి వారి కృపకు పాత్రులు కావాలని జగన్మోహనాచార్యులు కోరారు.

## భక్తిశ్రద్ధలతో గోదారంగనాథ స్వామి కళ్యాణ మహోత్సవం



కళ్యాణంలో పాల్గొన్న దివ్యశ్రీ రమణచక్రవర్తులు

**ఎల్.బి.నగర్, జనవరి 13 ప్రభాతవార్త:** కొత్తపేటలోని శ్వేత గార్డెన్‌లో శుక్రవారం శ్రీలక్ష్మీ నారాయణ సేవా సమితి ఆధ్వర్యంలో దివ్యశ్రీరమణచక్రవర్తుల ప్రత్యక్ష పర్యవేక్షణలో గోదా రంగనాథస్వామి కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. కార్యక్రమానికి జగన్నాథ్ మట్ పీఠాధిపతులు త్రిదండి రామానుజవ్రతధర జీయర్‌స్వామి మంగళశాసనాలు అందజేశారు. ఈ సందర్భంగా గురుమాత దివ్యశ్రీ రమణచక్రవర్తులు మాట్లాడుతూ గోదాదేవి తిరుప్పావై ద్వారా వేద పరిచయము, భగవంతుని పరిచయము, భగవంతుని పొందటం, జీవన సిద్ధించుకోవడం ఎలా అనే విషయాలను క్లుప్తంగా వివరించారు. ఈ కార్యక్రమంలో ఉభయ వేదాంత ప్రవర్తకాచార్యులు కందాడై రామానుజాచార్యులు, తెలంగాణ ఇరిగేషన్ డెవలప్మెంట్ బోర్డ్ చైర్మన్ సముద్రాల వేణుగోపాలచార్యులు, వెంకటరమణాచార్యులు, సేవా సమితి సభ్యులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## చంపాపేటలో ఘనంగా ముగ్గుల పోటలు



బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

**సైదాబాద్, జనవరి 13 ప్రభాతవార్త:** సంక్రాంతి పండుగను పురస్కరించుకుని చంపాపేట డివిజన్ బిఆర్ఎస్ నాయకులు నల్ల రఘుమారెడ్డి ఆధ్వర్యంలో కటికోనికుంటలో శుక్రవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎల్‌బినగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలు ఇంటి ముందు అలంకరించే అందమైన రంగవల్లులు ఇంటికి మరింత శోభను తెస్తాయన్నారు. కాగా ఎ విభాగంలో లక్ష్మమ్మ, శారద, ప్రతీక్ష, బి విభాగంలో విజిత, గాయత్రి, అవంతిక, సి విభాగంలో మమత, శరణ్య, మనోరమ, డి విభాగంలో మమత, దివ్యశ్రీ, వనజలు విజేతలుగా నిలిచారు.

## శ్రీహిల్స్‌లో సంక్రాంతి ముగ్గుల పోటీలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న రామిడి రాంరెడ్డి

**సరూర్‌నగర్, జనవరి 13 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని అల్మాస్‌గూడ శ్రీహిల్స్ కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంక్రాంతి ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కార్పొరేషన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, రామిడి రాంరెడ్డి విజేతలకు బహుమతులను అందజేశారు. కాలనీ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో 26వ డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షుడు పుల్లారెడ్డి, కాలనీ సంక్షేమ సంఘం నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం : చెకొలేకార్



ఠాక్రేను కలిసిన రేవంత్‌రెడ్డి, చెకొలేకార్ తదితరులు

**మలక్‌పేట, జనవరి 13 ప్రభాతవార్త :** కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని టిపిసిసి ప్రధాన కార్యదర్శి చెకొలేకార్ శ్రీనివాస్ పేర్కొన్నారు. నగరానికి విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి మాణిక్‌రావు ఠాక్రేను చెకొలేకార్ కలిసి పలు అంశాలగురించి చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమంకోసం కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తుందని తెలిపారు. పార్టీని బలోపేతం చేయడానికి తన వంతు కృషి చేస్తానని

## అదనపు నిధులను కేటాయించి సమస్యలను పరిష్కరిస్తాం



కార్పొరేటర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న కాలనీవాసులు

**హయత్‌నగర్, జనవరి 13 ప్రభాతవార్త:** వెనుకబడిన కాలనీలకు అదనపు నిధులను కేటాయించి డ్రైనేజీ సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని సీతారాంపురం కాలనీ, బాబు జగ్జీవన్‌రామ్ కాలనీలో ఆయన శుక్రవారం పర్యటించి సమస్యలను తెలుసుకున్నారు. బాబు జగ్జీవన్‌రామ్ కాలనీలో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారడంతో మురుగునీరు పొంగి పొర్లుతోందని కాలనీవాసులు కార్పొరేటర్‌కు సమస్యను వివరించారు. మురుగు కారణంగా దుర్గంధం, దోమలు ఎక్కువై ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారని తెలిపారు. సీతారాంపురం కాలనీలో నీటి సమస్య ఉందని కాలనీవాసులు ఫిర్యాదు చేశారు. దీనిపై కార్పొరేటర్ స్పందిస్తూ... అధికారులతో చర్చించి డ్రైనేజీ, నీటి సరఫరా సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతానని హామీనిచ్చారు. కార్యక్రమంలో జలమండలి మేనేజరు రాజు, జీహెచ్ఎంసీ ఏఈ నరేంద్రతేజ, ఆయా కాలనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## పండుగుల సాంప్రదాయాలకు ప్రతిరూపాలు : ఎమ్మెల్యే దేవిరెడ్డి



మహిళలు వేసిన ముగ్గులను తిలకిస్తున్న సుధీర్‌రెడ్డి

**మన్సూరాబాద్, జనవరి 13 ప్రభాతవార్త :** ఎల్‌బినగర్‌లోని బిగ్‌బజార్‌వద్దఉన్న ఎగ్జిబిషన్‌గ్రౌండ్‌లో ఎల్‌బినగర్ బిఆర్ఎస్ పార్టీ మహిళా విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి సంబరాల వేడుకలకు ఎల్‌బినగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుదీర్‌రెడ్డి ముఖ్యఅతిధిగా హాజరై మాట్లాడుతూ మహిళలు ఇంటి ముందు అలంకరించే అందమైన రంగవల్లులు ఇంటికి మరింత శోభను తెస్తాయమన్నారు. పండుగలు మన సంస్కృతి సాంప్రదాయాలకు చిహ్నాలుగా నిలుస్తాయని అన్నారు. ఈ వేడుకలలో మహిళలు ముగ్గులు, సంక్రాంతి పిండివంటలు, పతంగులను ఎగరవేసి సంతోషంగా గడిపారు. ఈ కార్యక్రమంలో కమలాసుధీర్‌రెడ్డి, ఈశ్వరమ్మయాదవ్, పద్మానాయక్, కొప్పుల విఠల్‌రెడ్డి, మల్లారెడ్డి, రంగేశ్వరీ, లీలా, ధనలక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

## హబ్సిగూడలో పారిశుధ్య కార్మికులకు కిట్లు పంపిణీ



హబ్సిగూడలో పారిశుధ్య కార్మికులకు కిట్లు అందజేస్తున్న ఎం.పరమేశ్వర్‌రెడ్డి, కాలేరు జైనవీన్ తదితరులు

**ఉప్పల్, జనవరి 13 ప్రభాతవార్త :** హబ్సిగూడ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు కాలేరు జైనవీన్ ఆధ్వర్యంలో శుక్రవారం గణేష్‌నగర్ ఆటో స్టాండ్ వద్ద పారిశుధ్య కార్మికులకు పిసిసి చీఫ్ రేవంత్‌రెడ్డి వింటర్ కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ ఏ బ్లాక్ అధ్యక్షుడు మందముల్ల పరమేశ్వర్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పిసిసి చీఫ్ రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. రేవంత్‌రెడ్డి సహకారంతో పారిశుధ్య కార్మికులకు ఉచితంగా కిట్లు అందజేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి కార్యదర్శి చరణ్ కౌశిక్ యాదవ్, మెంబర్ ఎం.డి.తౌఫిక్, మర్రి రంజిత్‌రెడ్డి, యూత్‌కాంగ్రెస్‌అధ్యక్షుడు అకారపు అరుణ్‌కుమార్, సీనియర్ కాంగ్రెస్‌నాయకులు బాలయ్య, మురళీకృష్ణముదిరాజ్, బాబు, శ్యామ్, ఉపేందర్‌రెడ్డి, శ్రీనివాసాచారి, గడ్డం నరసింహా, సందీప్, ధర్మేందర్ నాయక్, షబ్బీర్, సంపత్, శివ, సాయి, శరత్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ముగ్గుల పోటీలకు అపూర్వ స్పందన



బహుమతులు అందజేస్తున్న బండారి లక్ష్మారెడ్డి తదితరులు

**ఉప్పల్, జనవరి 13 ప్రభాతవార్త :** ఉప్పల్ నియోజకవర్గం న్యూ భరత్‌నగర్ కాలనీలో బిఎల్ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో బిఎల్ఆర్ ట్రస్ట్ వ్యవస్థాపక చైర్మన్ బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ బిఎల్ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్ని డివిజన్ పరిధిలో వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోటీలలో లాస్య, మానస, రాధిక ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు ఆకుల మహేందర్, అన్య బాలకృష్ణ, కడిగె శేఖర్, సుక్క కిరణ్, నిరంజన్‌చారి, శేఖర్, బింగి భరత్‌గౌడ్, అల్వాల నాగరాజు, ఎం.శేఖర్, రాముర్‌రెడ్డి, నవీన్‌గౌడ్, రాజిరెడ్డి, నవీన్‌చారి, కాలనీ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

## అందుల జీవితాల్లో వెలుగులు నింపిన బ్రెయిలీ ఆదర్శనీయుడు

**హయత్‌నగర్, జనవరి 13 ప్రభాతవార్త:** ప్రపంచ వ్యాప్తంగా అందుల జీవితాల్లో తన లిపి ద్వారా లూయిస్ బ్రెయిలీ వెలుగులు నింపారని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. లూయిస్ బ్రెయిరీ జయంతిని పురస్కరించుకుని మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని వీరన్నగుట్టలో ప్రతిభావంతుల వికలాంగులసేవాసంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన వికలాంగులకు ట్రైసైకిళ్లు, అందులకు చేతికర్రలు, క్యాలెండర్లు అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ... తమ స్పర్శ ద్వారా కాగితంపై చుక్కలకు అర్థాలను, సంఖ్యలను వివరించడం అద్భుతమన్నారు. లూయిస్ బ్రెయిలీ చిన్నతనంలోనే కంటి చూపు కోల్పోవడంద్వారా ఎదుర్కొన్న ఇబ్బందులను మరొకరు ఎదుర్కొనవద్దని లిపిని రూపొందించడం గొప్ప విషయమన్నారు. ఎంతోమంది అందులు లిపిని నేర్చుకుని ఉపాధిని సైతం పొందుతున్నారని వివరించారు. కార్యక్రమంలో పండరయ్య, రామచంద్రయ్య, పి.వి.రావు, పాండు, భాస్కర్, సుధాకర్, వెంకన్న, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

## చిలుకానగర్ కురుమ సంఘం ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

**ఉప్పల్, జనవరి 13 ప్రభాతవార్త :** చిలుకానగర్ కురుమ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి స్థానిక కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ముఖ్య అతిథిగా పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ సంక్రాంతి పండుగ ప్రతి ఒక్కరు ఆనందోత్సవాలతో చేసుకోవాలని సూచించారు. కుల, మతాలకతీతంగా ముగ్గుల పోటీలలో పాల్గొనడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు కొండల్‌రెడ్డి, అప్సర్‌బాయ్, రామానుజం, పోటోబాలు, బాలేందర్, నరేష్, శ్యామ్, కురుమ సంఘం నేతలు పర్వతాలు, కృష్ణ, గొరిగె ఐలయ్య, సైదులు, చంద్రయ్య, రాజు నరసింహ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ మల్లికార్జునస్వామి ఆలయం అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే బేతి



ఎమ్మెల్యే బేతి సమక్షంలో విరాళం అందజేస్తున్న రంజిత్‌రెడ్డి

**రామంతాపూర్, జనవరి 13 ప్రభాతవార్త :** రామంతాపూర్‌లోని పురాతన మల్లికార్జునస్వామి ఆలయం అభివృద్ధికి దాతలు చేయూత అందించాలని ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి పేర్కొన్నారు. ఈమేరకు శుక్రవారం కాంగ్రెస్ నేత మర్రి రంజిత్‌రెడ్డి ఆలయానికి ఎమ్మెల్యే బేతి సమక్షంలో రూ.లక్ష నగదు విరాళం అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి మాట్లాడుతూ మల్లికార్జునస్వామి ఆలయం వెనుక ఉన్న స్థలంలో కల్యాణ మండపం నిర్మిస్తున్నారని, త్వరలోనే మండపం ప్రారంభిస్తామని తెలిపారు. దాత మర్రి రంజిత్‌రెడ్డి మాట్లాడుతూ శివాలయం అభివృద్ధికి తనవంతు చేయూత అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు శేఖర్‌బాబు, కమిటి సభ్యులు ఎం.దయాకర్‌రెడ్డి, ముత్యాల పాండు, ప్రశాంతి, బాల్‌రెడ్డి, సర్వ కృష్ణ యాదవ్, నాయకులు వెంకటేశ్వర్‌రెడ్డి, గడ్డం రవికుమార్, గరిక సుధాకర్, జి.కృష్ణారెడ్డి, ఎం.డి.ముస్తాక్, జెసిబి రాజు, సంతోష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జిమ్ పరికరాలు మాయం చేసిన వారిపై చర్య తీసుకోవాలి: కార్పొరేటర్

**ఎల్.బి.నగర్, జనవరి 13 ప్రభాతవార్త:** లక్షరాది రూపాయల విలువచేసే జిమ్ పరికరాలు న్యాయం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని చైతన్యపురి డివిజన్ కార్పొరేటర్ రంగ నరసింహగుప్తా డిమాండ్ చేశారు. చైతన్యపురి డివిజన్ సాయినగర్‌కాలనీలోని సీనియర్ సిటిజన్ భవనం మొదటి అంతస్తులు 15.50లక్షల వ్యయంతో 2020 సెప్టెంబర్‌లో జిమ్ సెంటర్ ఏర్పాటు చేస్తే అందులో ఒక్క పరికరం కూడా లేకపోవడంతో కార్పొరేటర్ అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే, కార్పొరేటర్ ప్రారంభించిన జిమ్ సెంటర్లో సామాగ్రి ఎక్కడికి వెళ్లాయని ఆయన ప్రశ్నించారు. జిమ్ సెంటర్‌ను కాలనీవాసులకు అప్పగించకుండా అప్పటి నుంచి తాళం ఎందుకు వేశారని ప్రశ్నించారు. ప్రజా ప్రయోజనాలను పక్కనపెట్టి వ్యక్తిగత ప్రయోజనాల కోసమే జిమ్ సెంటర్ ఏర్పాటుచేసి అందులోని సామాగ్రిని మాయం చేసినట్లు కార్పొరేటర్ తెలిపారు.. ఈ విషయమై కాలనీవాసులు అధికారులకు ఫిర్యాదు చేయగా జిహెచ్ఎంసి ఏఈ తాళం పగలగొట్టి చూడగా అందులో ఒక్కవస్తువు కూడా లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జిమ్ పరికరాల విషయమై విచారణ చేపట్టి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని జోనల్‌కమిషనర్ పంకజ, చైతన్యపురి పోలీసులకు ఫిర్యాదు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ బిజెపి అధ్యక్షుడు వినోద్‌కుమార్‌యాదవ్ పాల్గొన్నారు.

## పివిటి మార్కెట్లో రంగోలి పోటీలు



ముగ్గులను తిలకిస్తున్న రేణుకరెడ్డి, జ్యోతి

**ఎల్.బి.నగర్, జనవరి 13 ప్రభాతవార్త:** సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని కొత్తపేట కృషి మహిళా మండలి, పద్మ వంశీ టెక్స్‌టైల్స్ సంయుక్త ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. మహిళలు పెద్దఎత్తున హాజరై సుమారు 75 రకాల అందమైన ముగ్గులు వేసి అందరినీ ఆకట్టుకున్నారు. తెలుగు సంస్కృతి, సాంప్రదాయాలకు అద్దంపట్టే విధంగా రంగురంగుల ముగ్గులను వేశారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు రెండు కన్సోలేషన్ బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కృషి మహిళా సంఘం అధ్యక్షురాలు సైకం రేణుకరెడ్డి, బోడెపూడి జ్యోతి, శశికళ, కల్పన, సునీతరెడ్డి, విజయలక్ష్మి, జానకి, విజయ, పద్మ, సరస్వతి, డాక్టర్ బి.విజయరంగా పివిటి అధ్యక్షుడు కైరంకొండ ధనుంజయ, ఉపాధ్యక్షులు శ్రీధర్, సెక్రటరీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

## పెన్షనర్స్ సంక్షేమానికి కృషి : ప్రవీణప్రభ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ప్రవీణప్రభ, భరత్‌రెడ్డి తదితరులు

**మలక్‌పేట, జనవరి 13 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ సంక్షేమానికి కృషిచేస్తానని ట్రెజరీ డిపార్ట్‌మెంట్ జాయింట్ డైరెక్టర్ ప్రవీణప్రభ పేర్కొన్నారు. పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన అసోసియేషన్ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణకార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రవీణప్రభ, ప్రెస్ అకాడమి సెక్రటరీ వెంకటేష్‌రావు హాజరయ్యారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షుడు మారం భరత్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి నెల 2వ తేదీన పెన్షన్ ఇవ్వాలని పేర్కొన్నారు. అదేవిధంగా నకర చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వినయ్‌కుమార్, ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

## సంక్రాంతి సందర్భంగా ముగ్గుల పోటీలు



మహిళలు వేసిన ముగ్గులను తిలకిస్తున్న లచ్చిరెడ్డి

**వనస్థలిపురం, జనవరి 13 ప్రభాతవార్త :** బి.యన్.రెడ్డి నగర్ డివిజన్ జక్కిడి రామ్‌రెడ్డి కాలనీలో నిర్వహించిన ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి విచ్చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ముగ్గుల పోటీలు కాలనీలో నిర్వహించడం సంతోషకరంగా ఉందన్నారు. విజేతలకు స్వంత ఖర్చుతో బహుమతులను అందజేసారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు యదిరెడ్డి, సభ్యులు రాములు, నాగేందర్, వెంకటేశం, నాగేశ్వరరావు పార్టీ డివిజన్ ప్రధాన కార్యదర్శి ముదుపు సందీప్‌రెడ్డి, విష్ణువర్దన్ రెడ్డి, మహిళా అధ్యక్షురాలు ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.